క్లుప్తంగా

అనిల్‌కుమార్‌కు డాక్టరేట్



పరకాల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్రం బోధిస్తున్న అధ్యాపకుడు అనుమాసు అనిల్‌కుమార్‌ను కాకతీయ యూనివర్సిటీ వాణిజ్య శాస్త్ర విభాగం నుంచి డాక్టరేట్ వరించింది. సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి. శశిధర్ పర్యవేక్షణలో అనిల్‌కుమార్ వినియోగదారుని ప్రవర్తనపై డిజిటల్ మార్కెటింగ్ ప్రభావం, తెలంగాణ రాష్ట్రంలో ఎఫ్ఎంసీజీపై అధ్యయనం చేసి పరిశోధన సిద్ధాంతం అందజేశారు. తన పరిశోధనలోని 12 ఆర్టికల్స్‌ను జాతీయ, అంతర్జాతీయ ప్రచురణ అయ్యింది. దీంతో అభినందించిన యూనివర్సిటీ వాణిజ్యశాస్త్ర విభాగం డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు

సీఎం ప్రమాణస్వీకారానికి తరలిరావాలి

ఆత్మకూరు: నేడు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారానికి మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ప్రజాసేవలో ఉండాలి

ఆత్మకూరు: మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజాసేవలో ఉండాలని ఆ పార్టీ మండల ప్రధానకార్యదర్శి బొల్లోజు కుమారస్వామి కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ శ్రేణులు గ్రామాల్లోని ప్రజల ఇబ్బందులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాలతో ప్రజాసేవలో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు.

పాలసీ చెక్కు అందజేత



శాయంపేట : మండలంలోని వసంతాపూర్‌కు చెందిన బాపూజీ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు కూతురు విద్యాసాగర్ ఇటీవల మృతి చెందాడు. కాగా విద్యాసాగర్ పొదుపు సంఘంలో పాలసీ పొంది ఉండగా జీఎఫ్ఎస్ అభయ నిధి సొమ్ము రూ. 70వేలతో పాటు పొదుపు బోనస్ రూ. 30వేల114ను సమితి అధ్యక్షుడు ఎండి ఉస్మాన్ బుధవారం నామినికి అందించారు. సంఘం ఉపాధ్యక్షుడు మొగిడే బాపురావు, పాలకవర్గ సభ్యుడు పాపారావు, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మల్లాజీ, అమరేందర్, ప్రేమ్‌సాగర్, రాజేశ్వర్, విజయరావు, లింగమూర్తి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌ను కలిసిన 'మార్నేని'



ఐనవోలు: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మార్నేని వెంకటేశ్వర్‌రావు ఢిల్లీలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి శాలువా కప్పి సన్మానించారు.

రేవంత్‌రెడ్డికి అభినందనలు

వరంగల్ : టీపీసీసీ అధ్యక్షులు, తెలంగాణ నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఢిల్లీలో పీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



హసన్‌పర్తి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ విజయ్‌కుమార్ సూచించారు. నగరంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్‌క్రైమ్, కేయూసీ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మొబైల్‌లో వచ్చే లింక్‌లను క్లిక్ చేయొద్దన్నారు. ఫోన్‌లో వచ్చే ఓటీపీలపై అప్రమత్తంగా ఉండడమే కాకుండా వాటిని ఎవరికి చెప్పొద్దని సూచించారు. గుర్తు తెలియని ఫోన్‌కాల్స్ వస్తే స్పందించవద్దని అన్నారు. ఇంటర్‌నెట్‌ను మంచికోసమే ఉపయోగించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కేయూసీ ఎస్సై రాజ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దామెర: నివాళులర్పిస్తున్న నాయకులు



శాయంపేట : పూలమాల వేస్తున్న నాయకులు



పరకాల : బీజేపీ ఆధ్వర్యంలో..



వేలేరులో..



ఎల్కతుర్తి : ముల్కనూరులో ..

అంబేడ్కర్ అందరివాడు

- ఆయన ఆశయ సాధనకు పాటుపడాలి
- వర్ధంతిలో పలువురి నివాళి



ఎల్కతుర్తి: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్, తదితరులు

ఎల్కతుర్తి: భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అందరివాడని పలువురు నాయకులు, అధికారులు అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల అంబేడ్కర్ విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ అంబేడ్కర్ సూచించిన మార్గంలో నడవాలని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు మేకల స్వప్న, జక్కుల అనిత, జెడ్పీటీసీ వంగ రవీందర్, ఎస్సై గోదారి రాజ్‌కుమార్, సాయిబాబు, ఎంపీడీఓలు సునీత, భాస్కర్, తహసీల్దార్‌లు జగత్‌సింగ్, వెంకటభాస్కర్, ఎంపీడీఓ తూర్పాటి సునీత, ఎస్సై పరమేష్ నాయకులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, మేకల బాబురావు, సాతూరి చంద్రమౌళి, ఉట్కూరి రాములు, శనిగరం వెంకటేష్, స్వర్ణలత, చెప్యాల ప్రకాశ్, రాజు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 67 వర్ధంతిని పట్టణంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజాసంఘాలు, అధికారులు బుధవారం నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్‌తో పాటు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, ఆ పార్టీ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతితో పాటు నడికూడ, ఆత్మకూరు, దామెర మండలాల నాయకులు హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 67వ వర్ధంతిని మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో బుధవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, పైండ్ల సంపత్ నివాళులర్పించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో అంబేడ్కర్ చిత్ర పటానికి హెచ్ఎం శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతిని మండలంలోని రాపాకపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని, దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కును కల్పించాడని అన్నారు. ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి బాబు, కిషన్, కరుణాకర్, శ్యాంసుందర్, కుమార స్వామి పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని పీచరలో అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా ఎంపీటీసీ జల్తారి సంపత్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఉపాధ్యక్షుడు కరుణాకర్, వెంకటేశ్, సుధాకర్, నరేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండల కేంద్రంలో అంబేడ్కర్ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీతో పాటు వివిధ సంఘాల నాయకులు బుధవారం నిర్వహించారు. చింతల రవిపాల్, చిందం రవి, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్, బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, కొమురయ్య, నాగరాజు, రాము, కట్టయ్య, లెనిన్, రాజుకుమార్, దేవయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మురళి అన్నారు. మండలంలోని పులుకుర్తిలో బుధవారం అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ సుమలత, వార్డు సభ్యులు కిరణ్, సూధన్, రాజు, భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే ఊరుగొండలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆసంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు.



ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలలో..



పరకాల: కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



పరకాల: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..



ఐనవోలు : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

గొప్ప గులాబీ సైనికున్ని కోల్పోయాం

- పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు నడిపిన నాయకుడు సంపత్‌రెడ్డి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



సంపత్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, సుధీర్‌కుమార్

హన్మకొండ: బీఆర్ఎస్ జనగామ జిల్లా అధ్యక్షుడు, జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి మృతితో గొప్ప గులాబీ సైనికున్ని కోల్పోయామని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సంపత్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా సంపత్‌రెడ్డి చిత్రపటానికి వినయ్‌భాస్కర్, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించడంతో పాటు బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు నడిపిన నాయకుడు సంపత్‌రెడ్డి అని అన్నారు. కార్యకర్తలను కాపాడుకుంటూ జనగాం జిల్లాలో పార్టీ పటిష్ఠతకు పాటుపడ్డారన్నారు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కోఆర్డినేటర్ జనార్దన్ గౌడ్, నాయకులు పులి రజనీకాంత్, వీరేందర్, సిరాజుద్దీన్, నయిముద్దీన్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- పట్టించుకోని అధికారులు
- భయాందోళనలో ప్రజలు



కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు

హసన్‌పర్తి: మండలంలోని పెంబర్తి శివారులోని ఓ విద్యుత్ స్తంభం దెబ్బతింది. దీంతో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. ఏడాది కాలంగా ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెంబర్తిలోని వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం గతేడాది గాలి దుమారానికి దెబ్బతిన్నది. స్తంభం మధ్యలో విరిగిపోవడం వల్ల పక్కన ఉన్న తాటి చెట్టుకు ఒరిగింది. దీంతో ఆ లైన్ గూండా వెళ్లే విద్యుత్ తీగలు కిందికి వేళాతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి.

అధికారులు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

కాగా, విద్యుత్ స్తంభం దెబ్బతిని తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఆ మార్గం గూండా వెళ్లే పాఠశాల వాహనాలకు విద్యుత్ తీగల ముంపు నెలకొని ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయమై రైతులు లిఖితపూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్పందన లేదని రైతులు వాపోతున్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

పాఠశాలను సందర్శించిన ఆర్జేడీ



విద్యార్థి చదువు తీరును పరిశీలిస్తున్నఆర్జేడీ

హసన్‌పర్తి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆర్జేడీ సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా తొలిమెట్టులో భాగంగా జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. పాఠాలు, చదువు తీరును పరిశీలించారు. పాఠాలు చదివిస్తూ సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠ్యపుస్తకాల ఆధారంగా సరైన బోధన సామాగ్రిని ఉపయోగించుకుని అభ్యసన ఫలితాలు సాధించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు, తదితరులుఉన్నారు.

వదలని 'మిచాంగ్' ముసురు




మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ధాన్యం రాశులపై కప్పిన టార్పాలిన్లు

కమలాపూర్: నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న మిచాంగ్ తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా బుధవారం చిరుజల్లులతో కూడిన ముసురు కురిసింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై కురిసిన ముసురుతో పాటు చలి తీవ్రత పెరగడంతో వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట కోతల సమయంలో మిచాంగ్ తుపాన్ రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరబోసిన వరి ధాన్యం రాశులపై ముందు జాగ్రత్తగా టార్పాలిన్‌లు కప్పినప్పటికీ కొన్ని చోట్ల రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. తుపాను కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దళిత ఎమ్మెల్యేను శాసనసభాపక్ష నేతగా ప్రకటించాలి

హన్మకొండ: దళితుడిని సీఎం చేస్తానని మాట తప్పిన కేసీఆర్ దళిత ఎమ్మెల్యేను బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేతగా ఎంపిక చేసి రాజశ్యామల దేవికి ప్రాయశ్చిత్తంగా పరిహారం చేసుకోవాలని శ్రీ రాజశ్యామలాదేవి, శ్రీ మహా వారాహీ దేవీ సేవా సమతి చైర్మన్ తిరువరంగం ప్రభాకర్ సూచించారు. రెండోసారి కేసీఆర్‌ను పరీక్షించాలని అవకాశం కల్పిస్తే బడుగు, బలహీన, దళిత, గిరిజన ప్రజలను వంచించారని, దీన్ని గమనించిన శ్రీ రాజశ్యామల దేవి తల నరుక్కోరని గ్రహించి భవిష్యత్‌లో తల దించుకుని బ్రతికేలా శపించిన ఫలితమే ఈ ఓటమికి కారణమని తెలిపారు. తిరిగి రాజశ్యామలాదేవీ అనుగ్రహం పొందాలంటే దళిత ఎమ్మెల్యేను బీఆర్ఎస్ శాసనసభ పక్ష నేతగా ఎన్నుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

'రేవూరి'కి మంత్రి పదవి ఇవ్వాలి



పరకాల: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని ఆపార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్ జయమ్మ పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజకీయంగానే కాకుండా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రేవూరి ప్రకాశ్ రెడ్డి మచ్చలేని నాయకుడని అన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇస్తే జిల్లా అభివృద్ధికి కృషిచేస్తారని తెలిపారు. అధిష్ఠానం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. నాయకులు కొలుగూరి రాజేశ్వర్‌రావు, పావుశెట్టి సునీల్, మేరుగు శ్రీశైలం, కుమార్, చందుపట్ల రాఘవరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

హసన్‌పర్తి: ఆధ్యాత్మిక చింతన ద్వారానే మానసిక ప్రశాంతత చేకూరుతోందని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. 65వ డివిజన్ దేవన్నపేటలో వెన్నపురెడ్డి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి



మామునూరు : బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రతి హోంగార్డ్ అంకిత భావం, నిబద్ధతతో పనిచేస్తున్నారని, హోంగార్డ్స్‌కు ఏమైనా సమస్యలు ఉంటే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని 4, 5 టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ల కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి కమాండెంట్ హామీ ఇచ్చారు. ఖిలావరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో పరిపాలన విభాగం అధికారుల ఆధ్వర్యంలో బుధవారం హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమాండెంట్ హాజరై హోంగార్డ్స్‌ను సన్మానించారు. ఏసీ జయరాం, రాంబాబు, ఆర్ఐ శోభన్, రమేష్, వెంకటేశ్వర్లు, దయాశీల, పురుషో త్తంరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా 'రైతువేదిక'



మద్యం సీసాలను చూపిస్తున్న సుమన్

శాయంపేట : రైతుల సమావేశం కోసం ప్రభుత్వం నిర్మించిన రైతు వేదిక మందుబాబులకు అడ్డగా మారుతోందని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ మండిపడ్డారు. మండల కేంద్రంలోని రైతువేదికను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు తమ సమస్యల పరిష్కారం, అభిప్రాయాలను చర్చించేందుకు రైతు వేదికలు నిర్మించారని, కానీ మండల కేంద్రంలోని రైతు వేదిక మందుబాబులకు అడ్డగా మారుతుందని ఆరోపించారు. రైతువేదికకు ఎదురుగా వైన్స్ షాపు ఉండడంతో మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబులూ.. దర్జాగా రైతువేదిక పరిసరాల్లో మద్యం సేవించి, ఖాళీ సీసాలు పగలగొడుతున్నారని అన్నారు. వ్యవసాయశాఖ అధికారులు పోలీస్‌లకు ఫిర్యాదు చేయకపోవడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



మృతి చెందిన రాజ్‌మహ్మద్

ఎల్కతుర్తి: ఫిట్స్‌తో ద్విచక్ర వాహనం నుంచి కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎండీ రాజ్‌మహ్మద్(47) కోడిగుడ్ల వ్యాపారం చేస్తున్నాడు. ఈనెల 3న తన ద్విచక్ర వాహనంపై కోడిగుడ్లు విక్రయించుకొని స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో బీపీ ఎక్కువై ఫిట్స్ వచ్చింది. దీంతో రాజ్‌మహ్మద్ ద్విచక్ర వాహనం నుంచి కిందపడ్డాడు. అటుగా వెళ్తున్న వ్యక్తి గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. తన కుమారుడు మహ్మద్ ఆజీజ్ హనుమకొండలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెదనరాలు చితికిపోయాయని, వెంటనే హైదరాబాద్ తరలించాలని సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాజ్‌మహ్మద్ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య సుల్తానాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయిబాబు వివరించారు.

'నాయిని'కి కేబినెట్‌లో అవకాశం కల్పించాలి

నయీంనగర్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కేబినెట్‌లో అవకాశం కల్పించాలని హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు అలువాల కార్తీక్ విజ్ఞప్తి చేశారు. బుధవారం హనుమమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో కార్తీక్ మాట్లాడుతూ.. ఇతర పార్టీల నాయకులు ఎన్ని అవకాశాలు ఇస్తామని ప్రలోభపెట్టినా లొంగకుండా 35 ఏళ్లుగా పార్టీని నమ్ముకొని కార్యకర్తల వెన్నుతడుతూ పార్టీ కోసం పనిచేశారన్నారు. అధిష్ఠానం గుర్తించి మంత్రి పదవీ ఇవ్వాలని కోరారు. నాయకులు వినయ్‌కుమార్, అరుణ్ రెడ్డి, సెహ్వాగ్, సునీల్‌నాయక్, రాకెష్, మనితేజ తదితరులు పాల్గొన్నారు.